



# పోరు తెలంగాణ

డిజిటల్ తెలుగు దినపత్రిక







కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 శనివారం 17-10-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04


## పాకిస్థాన్‌లో క్రైస్తవుడికి మరణశిక్ష ఖరారు.. సుప్రీంకోర్టు తీర్పుపై తీవ్ర విమర్శలు

- దైవదూషణ కేసులో క్రైస్తవుడి మరణశిక్షను సమర్థించిన పాక్ సుప్రీంకోర్టు
- అదే కేసులో నిందితుడి సోదరుడికి కోర్టు నుంచి విముక్తి
- ఒకే సాక్ష్యం ఇద్దరికీ భిన్నంగా ఎలా వర్తిస్తుందని ప్రశ్నిస్తున్న న్యాయవాదులు
- పాక్‌లో మైనారిటీలపై హింస పెరిగిందన్న మానవ హక్కుల కమిషన్ నివేదిక
- హిందూ, క్రైస్తవ బాలికల కిడ్నాప్‌లు, బలవంతపు వివాహాలపై తీవ్ర ఆందోళన




పాకిస్థాన్‌లో దైవదూషణ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక క్రైస్తవ వ్యక్తికి విధించిన మరణశిక్షను ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం - మిగతా 2 లో

## పుతిన్‌పై తిరుగుబాటు: సొంత సైన్యంపైనే దాడి చేయించిన రష్యా అధికారి!

- రష్యా సైన్యంలో పనిచేస్తూ ఉక్రెయిన్‌కు రహస్య సమాచారం
- 300 మందికి పైగా రష్యన్ సైనికుల మృతికి కారణమైన అధికారి
- యుద్ధరంగం నుంచి తప్పించుకుని ఉక్రెయిన్ పక్షాన చేరిక
- పుతిన్ పాలనకు వ్యతిరేకంగానే ఈ పని చేశానంటున్న లెఫ్టినెంట్
- వాల్ స్ట్రీట్ జర్నల్ వెలుగులోకి తెచ్చిన సంచలన కథనం



రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఒక సంచలన ఉదంతం వెలుగులోకి వచ్చింది. రష్యా సైన్యంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న 26 ఏళ్ల అధికారి, పుతిన్ ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకతతో తన మాతృదేశానికే వెన్నుపోటు పొడిచారు. ఉక్రెయిన్ నిఘా వర్గాలకు రహస్యంగా సైనిక సమాచారం అందించి, - మిగతా 2 లో

## ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం



- ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందన్న కవిత
- రేవంత్ పాలన పక్కన పెట్టేశారని విమర్శ
- రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉంటామని వెల్లడి

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై - మిగతా 2 లో

### రాహుల్ తాటాకు

## చప్పుళ్లకు భయపడం



- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు - మిగతా 2 లో

# తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ

- సీఎం రేవంత్‌తో హ్యుందాయ్ ప్రతినిధుల భేటీ
- సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులు
- జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన
- ఈ కేంద్రం ద్వారా 4,275 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- అనుమతులు వేగంగా జారీ చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్
- తెలంగాణలో కార్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని హ్యుందాయ్‌కు ఆహ్వానం



2లో

తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది.

### భారత్-అమెరికా

# వాణిజ్య ఒప్పందం



- చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!
- వీలైనంత త్వరగా ఒప్పందాన్ని ముగిస్తామన్న కేంద్రమంత్రి నిర్మల
- ఒప్పందం మొదటి దశ పూర్తయిందని, లీగల్ డ్రాఫ్ట్ సిద్ధమవుతోందని వెల్లడి
- ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం
- బ్యాంకాక్‌లో జరిగిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ సమావేశాల్లో వ్యాఖ్యలు

భారత్-అమెరికా మధ్యఎంతోకాలంగా - మిగతా 2 లో

## జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం



- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై రాహుల్ గాంధీ విమర్శలు
- విదేశాంగ మంత్రి జైశంకర్‌ను 'రూబియో సిబ్బంది' అంటూ పరోక్షంగా వ్యాఖ్యలు
- విదేశాంగ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ - మిగతా 2 లో

## హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వర్ష సూచన



- ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో వర్ష సూచన
- హైదరాబాద్, వరంగల్ సహా 9 జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం
- ఆంధ్రప్రదేశ్‌లోనూ పలుచోట్ల జల్లులు పడతాయని అంచనా
- వారంగా కొనసాగుతున్న ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం

గత వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో - మిగతా 2 లో

## జెలెన్‌స్కీ సరైన వ్యక్తి కాదు

# ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ట్రంప్ తీవ్ర విమర్శలు



- పుతిన్‌తో కంటే జెలెన్‌స్కీతో వ్యవహరించడమే కష్టమన్న ట్రంప్
- ఉక్రెయిన్ ప్రజలు మరో వ్యక్తిని ఎన్నుకుంటే మంచిదని సూచన

ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జెలెన్‌స్కీ అమెరికాతో వ్యవహరించడానికి సరైన వ్యక్తి కాదని, రష్యా అధ్యక్షుడు పుతిన్ కంటే అతనితో చర్చలు జరపడమే కష్టంగా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. - మిగతా 2 లో

# భూమాతకు జ్వరం!..

ప్రమాదకర స్థాయికి ఏడు కీలక సూచికలు

- గత 20 లక్షల సంవత్సరాలలో లేనంతగా కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు
- భూతాపం రేటు రెట్టింపునకు పైగా పెరిగిందని వెల్లడించిన నివేదిక
- మార్పు భవిష్యత్తు హెచ్చరిక కాదని, ప్రస్తుత నిర్ధారణ అన్న శాస్త్రవేత్తలు
- బ్రెజిల్ అమెజాన్‌లో అటవీ నిర్మూలన తగ్గడం సానుకూల పరిణామమని వెల్లడి

2లో



భూమి ఆరోగ్యం ప్రమాదకర స్థాయిలో ఉందని, దాని ప్రాణాధార సూచికల్లో ఏడు రికార్డు స్థాయికి చేరాయని శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలోని ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ

# తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ

మొదటిపేజీ తరువాయి – ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం, దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు. హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది

## ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం

మొదటిపేజీ తరువాయి – స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

మొదటిపేజీ తరువాయి – చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వర్ష సూచన..ఐఎండీ ప్రకటన

మొదటిపేజీ తరువాయి – దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో తెలంగాణలోనూ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలు జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నేటి నుంచే వర్షాలు ప్రారంభమవుతాయని వాతావరణ శాఖ తెలపడంతో.. తీవ్రమైన ఉక్కపోత, వడగాడ్పులతో సతమతమవుతున్న ప్రజలకు ఇది పెద్ద ఊరట. రుతుపవనాల రాకతో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడనుంది.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

మొదటిపేజీ తరువాయి – పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

## జెలెన్‌స్కీ సరైన వ్యక్తి కాదు: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



మొదటిపేజీ తరువాయి – ఉక్రెయిన్ ప్రజలు మరో నాయకుడిని ఎన్నుకుంటే మంచిదని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఆయిల్ రిఫైనరీలపై ఉక్రెయిన్ మళ్ళీ దాడులు ప్రారంభించడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులను అవమానకరంగా ఆయన అభివర్ణించారు. శాంతి కావాలని పైకి చెబుతూనే, జెలెన్‌స్కీ యుద్ధాన్ని కొనసాగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రపంచానికి ఇంధనం అవసరమైన తరుణంలో రిఫైనరీలపై దాడులు చేయడం సరికాదన్నారు. కొన్ని రోజుల క్రితం ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన 'ఇంధన కాల్పుల విరమణ' ఒప్పందాన్ని రష్యా గౌరవించలేదని ఉక్రెయిన్ ఆరోపించింది. విరామ సమయంలోనూ రష్యా తమ ఇంధన వ్యవస్థలపై దాడులు కొనసాగించిందని, అందుకే తాము తిరిగి దాడులు ప్రారంభించాల్సి వచ్చిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. దాడులపై ఉన్న ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ఆయన తేల్చిచెప్పారు. ఈ పరిణామాల నడుమ, ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాలోని రియాజాన్ ప్రాంతంలో ఉన్న ఆయిల్ రిఫైనరీపై దాడి చేయగా, భారీగా మంటలు చెలరేగాయి. మరోవైపు, మధ్య ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్ళీ తారస్థాయికి చేరాయి.

# పాకిస్థాన్‌లో క్రైస్తవుడికి మరణ శిక్ష ఖరారు.. సుప్రీంకోర్టు తీర్పుపై తీవ్ర విమర్శలు

మొదటిపేజీ తరువాయి – సమర్థించింది. మహమ్మద్ ప్రవక్తను కించపరిచే విధంగా వెబ్‌సైట్‌లో వ్యాఖ్యలు పోస్ట్ చేశారనే అభియోగాలపై ఖైజర్ అయూబ్‌కు విధించిన మరణశిక్షను సుప్రీంకోర్టు ఖరారు చేసింది. అయితే, ఇదే కేసులో నిందితుడిగా ఉన్న అతని సోదరుడు 46 ఏళ్ల అమూన్‌ను కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఒకే సాక్ష్యాధారాల ప్రతిపాదికన విచారించిన కేసులో ఇద్దరు సోదరులకు భిన్నమైన తీర్పులు వెలువడటంపై బాధితుల తరఫు న్యాయవాదులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వారు అత్యంత వినాశకరమైనదిగా అభివర్ణించారు. ఖైజర్, అమూన్ సోదరులపై 2018లో దైవదూషణ చట్టం కింద కేసు నమోదైంది, అప్పట్లోనే వారికి మరణశిక్ష విధించారు. దీనిని సవాలు చేస్తూ వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఒక సోదరుడిపై సాక్ష్యాధారాలు సరిపోవని భావించినప్పుడు, అవే ఆధారాలతో మరొకరికి మరణశిక్షను ఎలా ఖరారు చేస్తారని సెంటర్ ఫర్ లీగల్ ఎయిడ్, అసిస్టెన్స్ అండ్ సెటిల్‌మెంట్ (సీఎల్ఏఏఎస్) డైరెక్టర్ నాసిర్ సయీద్ ప్రశ్నించారు. తాను 2009లోనే తన వెబ్‌సైట్‌ను నిలిపివేశానని, అయితే తన




ముస్లిం స్నేహితుడు ఒకరు దానిని పునరుద్ధరించి, కాపీరైట్ వివరాలలో తన పేరును అలాగే ఉంచారని ఖైజర్ తన వాదనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఖైజర్ ప్రాణాలను రక్షించాలని, దైవదూషణ చట్టాల దుర్వినియోగాన్ని కట్టడి చేయాలని న్యాయవాదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ తీర్పు పాకిస్థాన్‌లో మతపరమైన మైనారిటీల రక్షణపై నెలకొన్న ఆందోళనలను మరోసారి తెరపైకి తెచ్చింది. పాకిస్థాన్ మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీపీ) విడుదల చేసిన 'సాంక్చురీ డినైడ్: 2025/26లో మత స్వేచ్ఛ' నివేదిక ప్రకారం, దేశంలోని మైనారిటీలు వ్యవస్థీకృత హింసను, వివక్షను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా హిందూ, క్రైస్తవ వర్గాలకు చెందిన బాలికల అపహరణ, బలవంతపు మతమార్పిడులు, వివాహాలు, దైవదూషణ చట్టాల దుర్వినియోగం, ఉగ్రవాద దాడులు వంటివి నిరంతరం కొనసాగుతున్నాయని 'బర్నబాస్ ఎయిడ్' నివేదిక హెచ్చరించింది. సింధ్ ప్రావిన్స్‌కు చెందిన హిందూ హక్కుల కార్యకర్త ఫకీర్ శివ కచ్చి అందించిన గణాంకాలను హెచ్ఆర్‌సీపీ ఈ సందర్భంగా ఉటంకించింది. 2025లో 36 మంది, 2026 ప్రథమార్థంలో 32 మంది హిందూ బాలికలు అపహరణకు గురయ్యారని ఆ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇవి కేవలం వెలుగులోకి వచ్చిన కేసులు మాత్రమేనని, వాస్తవంగా ఇలాంటి ఘటనలో ఇంకా ఎన్నో ఉండవచ్చని కచ్చి పేర్కొన్నట్లు నివేదిక వివరించింది. కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే పోలీస్ స్టేషన్ల ముందు నిరసనలు చేపట్టాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు అహ్మదీయ వర్గంపై దాడులు, సామాజికంగా వారిని వెలివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచారు.

# జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

మొదటిపేజీ తరువాయి – అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనకు ముందే రాజకీయ వివాదం నెలకొంది. ఈ పర్యటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. విదేశాంగ మంత్రిని ఉద్దేశించి ఆయన పరోక్షంగా 'రూబియో సిబ్బంది' అని సంబోధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలేం జరిగింది?

వచ్చే వారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ యూనిట్‌ను సందర్శించనున్నారు. అనంతరం ముంబైలో పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. ఈ భేటీలలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొంటారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రూబియో తన సిబ్బందిని ముంబైకి రమ్మని ఆదేశించారు. మోదీ గారూ... విదేశాంగ మంత్రిత్వ శాఖలో మీ అధికారులు ఏం జరుగుతుందో తెలియక గందరగోళంలో ఉన్నారు. వారికి మీరైనా వివరించండి...! లేదా నన్ను చెప్పమంటారా...!" అని తన పోస్టులో పేర్కొన్నారు.

వివాదాస్పదమైన వ్యాఖ్యలు

రాహుల్ గాంధీ తన పోస్టులో ఎక్కడా జైశంకర్ పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, "రూబియో తన సిబ్బందిని రమ్మన్నారు" అని అనడం ద్వారా పరోక్షంగా విదేశాంగ మంత్రిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక దేశ విదేశాంగ మంత్రిని, మరో దేశ విదేశాంగ మంత్రికి చెందిన 'సిబ్బంది' (ఘుటల) గా అభివర్ణించడం అనుచితమని, ఇది దౌత్యపరమైన హోదాను కించపరచడమేనని విమర్శలు వస్తున్నాయి. విదేశాంగ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారని పేర్కొనడం ద్వారా ప్రభుత్వ సమన్వయ లోపాన్ని ఎత్తిచూపే ప్రయత్నం చేశారని వారు అభిప్రాయపడుతున్నారు. ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యం, ప్రాంతీయ అభివృద్ధిలో పరస్పర సహకారం వంటి కీలక అంశాలపై చర్చించేందుకు రూబియో, జైశంకర్ మధ్య సమావేశం జరిగే అవకాశం ఉంది. ఇంతటి కీలకమైన పర్యటనకు ముందు రాహుల్ చేసిన వ్యాఖ్యలు అనవసర వివాదానికి దారితీశాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతల నుంచి కూడా తీవ్ర ప్రతిస్పందన వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# పుతిన్‌పై తిరుగుబాటు: సొంత సైన్యంపైనే దాడి చేయించిన రష్యా అధికారి!

మొదటిపేజీ తరువాయి – సుమారు 300 మందికి పైగా రష్యన్ సైనికుల మరణానికి కారణమయ్యారు. అనంతరం యుద్ధరంగం నుంచి చాకచక్యంగా తప్పించుకుని, ప్రస్తుతం ఉక్రెయిన్ పక్షాన రష్యాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. వాల్ స్ట్రీట్ జర్నల్ ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. వివరాల్లోకి వెళితే, లెఫ్టినెంట్ లెవ్ స్టూప్నికోవ్ రష్యా సైన్యంలో చీఫ్ సిగ్నల్స్ ఆఫీసర్‌గా సేవలందించేవారు. డాన్‌బాస్ ప్రాంతంలోని కీలకమైన వుహ్లేదర్‌ను స్వాధీనం చేసుకోవాల్సిన బెటాలియన్‌లో ఆయన పనిచేసేవారు. ఈ హోదాలో ఆయనకు సైనికుల కదలికలు, యుద్ధ వ్యూహాలు, డ్రోన్ల ఫీడ్స్, నిఘా కెమెరాల సమాచారం వంటి కీలక వివరాలన్నీ తెలిసేవి. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని తీవ్రంగా వ్యతిరేకించిన స్టూప్నికోవ్, ఆ సమాచారాన్ని రహస్యంగా ఉక్రెయిన్ మిలిటరీ ఇంటెలిజెన్స్‌కు చేరవేశారు. ఒకరోజు ఉదయం కడుపునొప్పిగా ఉందని నటిస్తూ తన సహచర సైనికుల నుంచి ఆయన దూరంగా వెళ్లారు. కొద్దిసేపటికే ఆయన పంపిన కోఆర్డినేట్ల ఆధారంగా ఉక్రెయిన్ క్షిపణి దాడులకు దిగింది. ఈ దాడిలో కల్నల్ గుసెయిన్ ముసయేవ్‌తో సహా 68 మంది రష్యా సైనికులు ప్రాణాలు కోల్పోగా, మరో 60 మంది గాయపడ్డారు. దాడి అనంతరం ఉక్రెయిన్ ప్రతినిధి నుంచి "పేలుళ్లు జరిగాయా? ఫొటో పంపు" అని సందేశం రాగా, "ఇక్కడ కేవలం మాంసం ముద్దలు మాత్రమే మిగిలాయి" అని ఆయన బదులిచ్చారు.

### తల్లి సహాయంతో పలాయనం

పుతిన్ పాలనను వ్యతిరేకించే స్టూప్నికోవ్ తల్లి టటియానా యాంట్సెన్, తన కుమారుడు ఉక్రెయిన్‌కు సహకరించేలా మార్గం సుగమం చేశారు. ఆమె ఉక్రెయిన్ మిలిటరీ ఇంటెలిజెన్స్‌తో సంబంధాలున్న దిమిత్రో కార్పెంకో అనే వ్యక్తిని సంప్రదించారు. అతని సహకారంతో స్టూప్నికోవ్ తప్పించుకునేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. 2024 జూలైలో ఒక రాత్రి వేళ తన యూనిట్ నుంచి తప్పించుకున్న స్టూప్నికోవ్, ముందస్తు ప్రణాళిక ప్రకారం ఉక్రెయిన్ స్థావరాల వైపు పయనించారు. "పీనట్ షాప్" అనే పాస్‌కోడ్ చెప్పి ఉక్రెయిన్ సైనికుల అదుపులోకి వెళ్లారు.

### దేశద్రోహం కాదు.. రాజ్యాంగ పరిరక్షణే

ప్రస్తుతం ఆయన రష్యన్ వాలంటీర్ కార్ప్స్ (=ఎజ) అనే విభాగంలో కమ్యూనికేషన్స్ నిపుణుడిగా పనిచేస్తున్నాడు. రష్యాకు వ్యతిరేకంగా పోరాడుతున్న రష్యన్లతోనే ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. తాను దేశద్రోహానికి పాల్పడలేదని, పుతిన్ పాలన రష్యా స్వేచ్ఛ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసిందని స్టూప్నికోవ్ పేర్కొన్నాడు. "నేను స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, రాజ్యాంగ బద్ధమైన క్రమాన్ని కాపాడతానని ప్రమాణం చేశాను. కానీ పుతిన్ వాటన్నింటినీ నాశనం చేశారు. అందుకే నేను ఈ నిర్ణయం తీసుకున్నాను" అని తన చర్యను సమర్థించుకున్నాడు. ఈ పరిణామాల నేపథ్యంలో భార్య ఆయనను విడిచిపెట్టగా, ఆయన తల్లి, సోదరి కూడా రష్యాను విడిచి పారిపోవాల్సి వచ్చింది.

# భూమాతకు జ్వరం!.. ప్రమాదకర స్థాయికి ఏడు కీలక సూచికలు

మొదటిపేజీ తరువాయి – నేతృత్వంలోని అంతర్జాతీయ నిపుణుల బృందం రూపొందించిన '2026 స్టేట్ ఆఫ్ ది క్లైమేట్ రిపోర్ట్' ఈ చేదు నిజాలను వెలుగులోకి తెచ్చింది. ప్రతిష్ఠాత్మక 'బయోసైన్స్' జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది. మానవ శరీరంలోని రక్తపోటు, నాడీ చలనం వంటి 16 ప్రాణాధారాలను పరీక్షించినట్లే, భూమి ఆరోగ్యానికి సంబంధించిన కీలక సూచికలను (వైటల్ సైన్స్) శాస్త్రవేత్తలు విశ్లేషించారు. వీటిలో ఏడు సూచికలు మునుపెన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరాయని, మిగిలినవి కూడా ప్రతికూల దిశలో పయనిస్తున్నాయని నివేదిక స్పష్టం చేసింది.

### నివేదికలోని కీలక అంశాలు

2026 మే నాటికి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ (జూ2) స్థాయి 428 పార్ట్స్ పర్ మిలియన్ (జూజూఎ)కు చేరింది. ఇది పారిశ్రామిక విప్లవానికి ముందు నాటి స్థాయుల కంటే 50 శాతం అధికం కాగా, గత 20 లక్షల సంవత్సరాలలో ఇదే అత్యధికం. కార్బన్ డయాక్సైడ్ కంటే 28-36 రెట్లు ఎక్కువ వేడిని బంధించే మీథేన్ (జు4), 265-298 రెట్లు శక్తివంతమైన నైట్రస్ ఆక్సైడ్ (టీ2ూ) కూడా రికార్డు స్థాయిలకు చేరుకున్నాయి. ఇంధన సంబంధిత కార్బన్ ఉద్గారాలు తొలిసారిగా 41 గిగాటన్నులను దాటాయి.

వీటితో పాటు సముద్ర మట్టాలు, సముద్ర గర్భంలోని ఉష్ణోగ్రతలు, కరిగిపోతున్న గ్లేసియర్లు, గ్రీన్‌లాండ్ మంచు ఫలకం ద్రవ్యరాశి వంటివి కూడా ఆందోళనకర రీతిలో రికార్డులు సృష్టిస్తున్నాయి. సముద్రాలు అపూర్వమైన స్థాయిలో వేడిని గ్రహించడం వల్ల ఉపరితల జలాలు వేడెక్కి 'సూపర్ ఎల్ నినో' వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

భూతాపం రేటు కూడా వేగవంతమవుతోంది. 1970-2010 మధ్య దశాబ్దానికి 0.19ీ సెంటీగ్రేడ్‌గా ఉన్న పెరుగుదల, ఇటీవలి కాలంలో 0.36ీ సెంటీగ్రేడ్‌కు పెరిగింది. ఈ నేపథ్యంలో 2026 సంవత్సరం చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆశాకిరణాలు.. హెచ్చరికలు

ఈ ఆందోళనకర పరిస్థితుల మధ్య కొన్ని ఆశాజనక పరిణామాలు కూడా ఉన్నాయి. బ్రెజిల్ అమెజాన్‌లో అటవీ నిర్మూలన వరుసగా నాలుగో ఏడాది తగ్గడం, సౌర, పవన విద్యుత్ వినియోగం 18 శాతం పెరగడం వంటివి సానుకూల అంశాలు. అయినప్పటికీ, 'యథాతథ వ్యాపార' ధోరణిని వీడి, తక్షణమే చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. "వేగవంతమైన అస్థిరత అనేది ఇక భవిష్యత్తు హెచ్చరిక కాదు, అది ప్రస్తుత నిర్ధారణ" అని నివేదిక సహ-రచయిత విలియం రిపుల్ వ్యాఖ్యానించారు. ఈ మార్పులు భూమిని కోలుకోలేని 'టిప్పింగ్ పాయింట్ల' వైపు నెడుతున్నాయని నివేదిక హెచ్చరించింది.

## నైజీరియాలో ఐఎస్ ఉగ్రవాదుల బీభత్సం



మొదటిపేజీ తరువాయి – నైజీరియాలో ఉగ్రవాదులు మరోసారి పెను విధ్వంసం సృష్టించారు. ఈశాన్య నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలో ఉన్న ఓ సైనిక స్థావరంపై ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ ఉగ్రవాదులు మంగళవారం రాత్రి భీకర దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 15 మంది సైనికులు, ఐదుగురు పౌర సేన సభ్యులు (యాంటీ-జిహాదిస్ట్ మిలీషియా) మరణించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. లేక్ చాద్ ప్రాంతంలోని మైరారీ గ్రామంలో ఉన్న ఈ సైనిక స్థావరాన్ని ఉగ్రవాదులు పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆయుధాలను దోచుకుని, స్థావరంలో ఉన్న వాహనాలతో సహా అన్నింటికీ నిప్పుపెట్టి బేస్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ దాడి నుంచి ప్రాణాలతో బయటపడిన సైనికులు సమీపంలోని మోంగునో పట్టణానికి చేరుకున్నారు. మరికొందరు సైనికుల ఆచూకీ గల్లంతవగా, వారిని ఉగ్రవాదులు బంధించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, రాత్రి 10 గంటల ప్రాంతంలో మొదలైన ఈ దాడి ఉదయం వరకు కొనసాగింది. ఉగ్రవాదులు సైనికులను తరిమికొట్టి, స్థావరంలోని విలువైన వస్తువులన్నింటినీ దోచుకుని, మిగిలిన వాటిని తగలబెట్టారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పొరుగున ఉన్న గుడుంబాలి ప్రాంతం నుంచి ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా నైజీరియాలో ఉగ్రవాద హింస విపరీతంగా పెరిగింది. బోకో హరామ్, దాని నుంచి విడిపోయిన ఐఎస్ డబ్ల్యూఏపీ వంటి ఉగ్రవాద సంస్థలు దాడులకు తెగబడుతున్నాయి. 17 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ హింసలో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. గత మూడు దశాబ్దాలలో ఎన్నడూ లేనంత తీవ్రమైన హింసాత్మక పరిస్థితులు ప్రస్తుతం నైజీరియాలో నెలకొన్నాయని ఏసీఎల్ఈడీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

## అలాంటి వాళ్లను కాల్చి చంపాలి.. ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి – సైనిక చర్య సమయాన్ని మార్చాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇలాంటి వారికి జీవితాంతం జైలు శిక్ష విధించాలని కూడా వ్యాఖ్యానించారు. అరిజోనా రాష్ట్రంలోని బుల్‌హెడ్ సిటీలో ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ముందు అమెరికా బాంబర్లు బయలుదేరే, చేరుకునే సమయాలు మీడియాకు చేరాయని ఆరోపించారు. ఈ వివరాలు న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్‌లో వచ్చినట్లు పేర్కొన్నారు.

### దాడి సమయం మార్చాల్సి వచ్చింది!

మిస్సోరీ నుంచి బీ-2 స్టెల్త్ బాంబర్లు బయలుదేరే సమయం బయటకు పొక్కడంతో ఆపరేషన్ ప్రమాదంలో పడిందని ట్రంప్ చెప్పారు. ఈ విషయంపై సీనియర్ సైనికాధికారులతో చర్చించినట్లు తెలిపారు. జనరల్ రజిన్ కేన్‌తో మాట్లాడిన తర్వాత దాడిని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అప్పటికే దాడికి సిద్ధమైన పైలట్లు ఈ నిర్ణయంతో నిరాశకు గురయ్యారని చెప్పారు.

### రెండు రోజుల తర్వాత దాడి

తొలుత అనుకున్న దాడిని రెండు రోజుల తర్వాత నిర్వహించినట్లు ట్రంప్ తెలిపారు. మొదట లీకైన సమయానికే బాంబర్లను పంపామని, దీంతో ఇరాన్ సైన్యాన్ని ఆశ్చర్యానికి గురిచేయగలిగామని పేర్కొన్నారు. అమెరికా సైనిక చర్యను ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా అభివర్ణించారు.

అయితే, లీకేజీకి పాల్పడిన వ్యక్తి ఎవరనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. ఆరోపణలకు మద్దతుగా ఆధారాలు చూపలేదు. ఈ వ్యవహారంలో విచారణ ద్వారా ఎవరినైనా గుర్తించారా? అన్నదానిపైనా స్పష్టత ఇవ్వలేదు.

### గూఢచర్య చట్టం కింద చర్యలు

అమెరికాలో జాతీయ రక్షణకు సంబంధించిన సమాచారాన్ని అనధికారికంగా బయటపెట్టడంపై కఠిన చట్టాలున్నాయి. అందులో 'ఎస్పియోనేజ్ యాక్ట్' కీలకమైనది. ఈ చట్టం కింద రహస్య సమాచారాన్ని అక్రమంగా భద్రపరచడం, ఇతరులకు చేరవేయడం వంటి చర్యలపై కేసులు నమోదు చేయవచ్చు. ఈ నేపథ్యంలో సైనిక రహస్యాల లీకేజీపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో అంబరాన్నంటిన బతుకమ్మ వేడుకలు పాల్గొన్న ఎమ్మెల్యే, పాయం వెంకటేశ్వర్లు





**మణుగూరు అక్టోబర్ 16 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు:** తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, పూల సౌందర్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ఆడపడుచులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో సందడి చేశారు. మహిళలతో మమేకమై పండుగ వేడుకల్లో పాల్గొని వారిలో ఉత్సాహాన్ని నింపారు.

**పూల పండుగతో పులకించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం**

వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు క్యాంపు కార్యాలయ ప్రాంగణానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. పూల పరిమళాలు, సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆడపడుచుల ఆటపాటలతో పరిసర ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. మహిళలందరూ సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను అందంగా అలంకరించి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండుగలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను చాటిచెప్పారు. తరతరాలుగా కొనసాగుతున్న బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ఎంతటి ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందో ఈ వేడుకలు మరోసారి చాటిచెప్పాయి.

**మహిళల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీక బతుకమ్మ**

బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, కుటుంబ అనుబంధాలకు, ప్రకృతితో మానవ జీవనానికి ఉన్న విడదీయలేని సంబంధానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ, ప్రకృతి ప్రసాదించిన వనరుల పట్ల కృతజ్ఞతను చాటుకోవడం బతుకమ్మ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. ఇలాంటి పండుగలు సమాజంలో సోదరభావాన్ని, పరస్పర గౌరవాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ పండుగల వైభవాన్ని కాపాడుకుంటూ, మన సంస్కృతీ సంప్రదాయాలను గర్వంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. మహిళలు కుటుంబానికి, సమాజానికి వెన్నెముకగా నిలుస్తారని, వారి సంతోషం, సంక్షేమం సమాజ అభివృద్ధిలో కీలకమని ఈ సందర్భంగా తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ వంటి సాంస్కృతిక వేడుకలు మహిళలందరినీ ఒకచోట చేర్చి ఆనందాన్ని పంచడంతో పాటు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గ ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా బతుకమ్మ వేడుకలు జరిపారు మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాల్లో ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన ఈ వేడుకలు ఆడపడుచుల్లో ఆనందాన్ని నింపాయి. పరస్పర ఆత్మీయతను పెంపొందిస్తూ, బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

# కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు కోతలపై బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: అక్టోబర్ 16(పోరు తెలంగాణ న్యూస్:** కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలలో భాగంగా పత్రికా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సందర్భంగా ఏఎంసి మాజీ ఛైర్మెన్ కుంచాల శేఖర్,ముత్యంపేట్ సింగిల్ విండో మాజీ చైర్మెన్ కోడిప్యాక తిరుపతి గౌడ్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్, దోమకొండ మాజీ పట్టణ అధ్యక్షులు బోరెడ్డి కిషన్ రెడ్డి గార్లు మాట్లాడుతూ.... ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎటు చూసినా కరెంటు కోతలు,ఎండిన పంటలు.....చేతికొచ్చిన పంట కరెంటు కోతలతో నీళ్లు పారక ఎండిపోతే పశువులను మేపుతున్న పరిస్థితులు..... రాష్ట్రంలో రైతులు మరియు ప్రజలు కరెంటు కష్టాలతో అల్లాడిపోతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో....ఎప్పుడు పోతుందో.....ఎవరికి తెలియని పరిస్థితి.. కరెంటు సరిగ్గా లేక మోటార్లు కాలిపోతున్నాయి, ట్రాన్స్ఫార్మర్లు పేలిపోతున్నాయి. పొలాలకు నీళ్లు పెట్టుకోవడానికి రైతులు అర్ధరాత్రులు కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఇన్ని జరుగుతుంటే మన ముఖ్యమంత్రికి ముందస్తు ప్రణాళిక లేదు. సమస్యను ఎలా పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదు.కరెంటు కోతలన్నింటికీ కారణం ఎల్లీనో అని ప్రకృతి పరిస్థితుల వల్ల ఈ సమస్య వచ్చిందని,ప్రజలను మరియు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుంది. కెసిఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం ఎంతో సుభిక్షంగా ఉండేది. అప్పుడు కెసిఆర్ వ్యవసాయాన్ని పండగ చేశారు. కానీ ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయాన్ని దండగ చేసే ప్రయత్నం చేస్తున్నారు. మేము టిఆర్ఎస్ పార్టీ తరపున ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి 18 గంటలు సక్రమంగా కరెంట్ సరఫరా చెయ్..... చేతకాకపోతే ముఖ్య మంత్రి పదవికి రాజీనామా చేయ్.... ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అని కాకుండా రాక్షస పాలన నడుస్తుందనడానికి నిదర్శనం ప్రస్తుత పరిస్థితులు అని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు జనగామ నరేష్,అరుట్ల అనిల్, వెన్నెల సిద్దరాములు,మాజీ ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్,సలీం,కానుగంటి నాగరాజు,మన్నె సాయిరెడ్డి,ముదాం గంగయ్య,బోరెడ్డి నాగరాజు రెడ్డి,చిట్యాల రాజిరెడ్డి,బుర్రి రవి,కూర చంద్రం,మహేందర్ గౌడ్,నీల శ్రీనివాస్,ఐరేణి రాజేందర్,బొమ్మెర గంగాధర్,బీసు సతీష్,మల్లెబోయిన రాజు,రంగోల్ మైసాగౌడ్,ఆశం యస్పాల్,బెంజరం మధుసూదన్,ఆశబోయిన రమేష్,అంజయ్య, సురేందర్ రెడ్డి,గోపి,చెన్నుగారి నర్సింలు,బొబ్బసాని శంకర్,సాయబు గారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మూలా నక్షత్రంలో సరస్వతీ దేవికి విశేష పూజలు

**భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న విద్యార్థులు, భక్తులు**

**విద్యార్థులకు పుస్తక ప్రసాదం పంపిణీ.. అమ్మవారికి 108 పెన్నుల మాలల సమర్పణ**



**పోరు తెలంగాణ నెక్కొండ, అక్టోబర్ 16:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నెక్కొండ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తిప్రపత్తులతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని నెక్కొండలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ సరస్వతీ దేవికి విశేష పూజలు నిర్వహించారు. విద్యకు, జ్ఞానానికి, వాక్కుకు, కళలకు అధిష్ఠాన దేవతగా కొలిచే సరస్వతీ దేవి శ్వేతవర్ణ అలంకరణలో కొలువుదీరగా, అమ్మవారిని దర్శించుకునేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో, భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. విద్యార్థులకు విద్యాబుద్ధులు, జ్ఞానసంపద, ఏకాగ్రత, వివేకం, మంచి వాక్పటిమను ప్రసాదించాలని ప్రార్థిస్తూ సరస్వతీ దేవిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రానికి విశేష ప్రాధాన్యం ఉండటంతో ఈ రోజున సరస్వతీ దేవిని పూజించడం శుభప్రదమని భక్తులు విశ్వసిస్తారు. ముఖ్యంగా విద్యార్థులు పుస్తకాలు, పెన్నులు అమ్మవారి సన్నిధిలో ఉంచి పూజలు చేయడం ద్వారా చదువులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించి అర్చకులు పూజలు చేశారు. సరస్వతీ దేవి అనుగ్రహంతో అజ్ఞానం తొలగి జ్ఞానం వికసిస్తుందని, విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తి, పట్టుదల, ఏకాగ్రత పెరుగుతాయని భక్తుల విశ్వాసం. విద్య అనేది కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి మాత్రమే కాకుండా, జీవితంలో వివేకంతో వ్యవహరించడానికి, మంచి విలువలను అలవరచుకోవడానికి దోహదపడుతుందని పూజా కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలయ అర్చకులు బివిఎన్ శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా వేద జ్యోతిష పరిశీలకులు బూర్గుపల్లి శ్రవణ్ శాస్త్రి అమ్మవారికి పుస్తకాలు, పెన్నులు సమర్పించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం పూజలో ఉంచిన పుస్తకాలను విద్యార్థులకు ప్రసాదంగా అందజేశారు. విద్యార్థులు పుస్తకాలను కేవలం చదువుకునే సాధనాలుగా మాత్రమే కాకుండా, జ్ఞానాన్ని అందించే పవిత్రమైన సంపదగా భావించాలని ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థుల జీవితాల్లో చదువుకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ, క్రమశిక్షణ, నిరంతర సాధన, గురువుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల విధేయతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మరికొందరు భక్తులు అమ్మవారికి 108 పెన్నులతో రూపొందించిన మాలలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. విద్యార్థులకు చదువులో మంచి ఫలితాలు రావాలని, ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు కలగాలని, జ్ఞానంతో పాటు సత్ప్రవర్తన అలవడాలని ప్రార్థించారు. సంప్రదాయ భక్తిని విద్యాభివృద్ధితో అనుసంధానిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సరస్వతీ దేవి ఆరాధనలో అంతర్లీనంగా ఉన్న సందేశం జ్ఞాన సముపార్జన, వివేక వికాసం, సత్ప్రవర్తన అని ఈ సందర్భంగా భక్తులు పేర్కొన్నారు. పుస్తకాలు, పెన్నులను అమ్మవారికి సమర్పించడం, వాటిని పూజానంతరం విద్యార్థులకు ప్రసాదంగా అందించడం ద్వారా విద్య పట్ల గౌరవాన్ని పెంపొందించే అర్చకులు ప్రయత్నం చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని, కష్టపడి చదివి, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆలయ అర్చకులు బి.వి.ఎన్. శాస్త్రి ఆధ్వర్యంలో, వేద జ్యోతిష పరిశీలకులు శ్రవణ్ శాస్త్రి, వరప్రసాద్ శర్మలు పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా కొనసాగించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు భక్తిమయంగా మారాయి. సరస్వతీ దేవి కృపతో విద్యార్థులందరికీ విద్యాబుద్ధులు, జ్ఞానం, వివేకం, సత్ప్రవర్తన సిద్ధించాలని అర్చకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భవాని మాలదారులు, శ్రీ రామలింగేశ్వర సేవా సమితి బాధ్యులు, డాక్టర్ సంగా వెంకటేశ్వర్లు , బొల్లం శివ , వెంకటేశ్వర్లు, ఆదిత్య శ్రీకాంత్ రాఘవేంద్ర ,లహరి, హరిత, సుమలత , రాధిక తదితరులు పాల్గొన్నారు. నెక్కొండ తండాలో... నెక్కొండ తండాలోని ఆంజనేయస్వామి ఆలయంలోనూ మూలా నక్షత్రం రోజున దుర్గా అమ్మవారిని సరస్వతి దేవి అలంకారంలో అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. చిన్నారులు విద్యార్థులు తల్లిదండ్రులు పూజల్లో పాల్గొన్నారు. మాలదారులు, నెక్కొండ తండా సర్పంచ్ బానోతు రవికుమార్ శ్రీకాంత్, మహేష్,రమేష్, సురేష్ ప్రవీణ్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల వైరల్ ఇన్ఫెక్షన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స పొందాలి**

**సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ పల్మనాలజిస్ట్ డా. కిషోర్ కుమార్ కామిశెట్టి**



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి జమ్మికుంట:** ఊపిరితిత్తుల వైరల్ ఇన్ఫెక్షన్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ పల్మనాలజిస్ట్ డా. కిషోర్ కుమార్ కామిశెట్టి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరస్‌ల వల్ల కలిగే శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు దగ్గు, తుమ్ముల ద్వారా వెలువడే తుంపరలతో ఇతరులకు వ్యాపించే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఇన్ఫెక్షన్ల వ్యాప్తి ప్రమాదాన్ని తగ్గించవచ్చని తెలిపారు. లక్షణాలను గుర్తించడం ముఖ్యం: అధిక జ్వరం, తలనొప్పి, దగ్గు, గొంతునొప్పి, ముక్కు కారడం లేదా మూసుకుపోవడం, శరీర నొప్పులు, అలసట, చలి, వణుకులు వంటి లక్షణాలు కనిపించవచ్చని డాక్టర్ వివరించారు. కొందరిలో వికారం, వాంతులు కూడా ఉండవచ్చన్నారు. ఈ లక్షణాలు కనిపించినప్పుడు ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు: చేతులను సబ్బుతో కనీసం 20 సెకన్ల పాటు శుభ్రంగా కడుక్కోవాలి. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు రుమాలు లేదా టిష్యూతో నోరు, ముక్కును కప్పుకోవాలి. శ్వాసకోశ లక్షణాలు ఉన్నప్పుడు ఇతరులకు ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా మాస్క్ ధరించడం, రద్దీ ప్రాంతాలకు వెళ్లడం తగ్గించడం వంటి జాగ్రత్తలు పాటించాలి. పోషకాహారం తీసుకుంటూ, తగినంత నీరు తాగుతూ శరీరానికి సరిపడా విశ్రాంతి ఇవ్వాలి. నిర్లక్ష్యం చేయవద్దు: జ్వరం, దగ్గు తీవ్రంగా ఉన్నా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగినా వెంటనే వైద్య సహాయం పొందాలని డా. కిషోర్ కుమార్ సూచించారు. సొంతంగా మందులు వాడకుండా వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని అత్యవసర లక్షణంగా పరిగణించి ఆలస్యం చేయకూడదన్నారు. వైద్య సేవలు: ఎంబీబీఎస్, ఎండీ పల్మనాలజీ పూర్తి చేసిన డా. కిషోర్ కుమార్ కామిశెట్టి యశోదా ఆసుపత్రి, సికింద్రాబాద్‌లో జూనియర్ కన్సల్టెంట్‌గా, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో రిజిస్ట్రార్‌గా పనిచేసిన అనుభవం కలిగి ఉన్నారు. జమ్మికుంటలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఛాతీ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలకు వైద్య సేవలు అందిస్తున్నామని అపాయింట్‌మెంట్ కోసం: 8712903600, 8712904600. సంప్రదించాలని తెలిపారు.

# జాతీయ కబడ్డీ శిక్షణ శిబిరానికి జిల్లా క్రీడాకారుల ఎంపిక



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్)** అండర్--20 బాలుర జాతీయ కబడ్డీ శిక్షణ శిబిరానికి నిజామాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు సురేష్, అబ్రార్ ఎంపికయ్యారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నెల 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హైదరాబాద్‌లోని బాచుపల్లి కాసాని కబడ్డీ అకాడమీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి వీరు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికైన సురేష్, అబ్రార్‌లను జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. క్రీడాకారులు శిక్షణలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శిస్తూ భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# బంతిపూల తోట... సద్దుల బతుకమ్మల కు సిద్ధం

**రైతు కష్టానికి ఫలితం దక్కేనా**



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి:** పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం గోపరపల్లి గ్రామంలో ఓ రైతు బంతిపూలతోట సాగు చేస్తున్నారు బంతిపూల తోట సద్దుల బతుకమ్మకు సిద్ధం పువ్వులను దేవతల కొలిచే తెలంగాణ రాష్ట్ర ప్రజల సాంస్కృతి తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి . బంతిపూల సాగుతో రైతు బంతిపూలు అమ్మకంతో రైతుకు గిట్టుబాటు దక్కేనా బంతిపూలతో మహిళలు బతుకమ్మను ఎంత అందంగా తయారుచేస్తారో అంత అందంగా బంగారు బతుకమ్మగా ఆకర్షిస్తుంది. బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లోని రైతు బంతిపూల సాగును పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు.

# బతుకమ్మ వేడుకలకు పెద్దచెరువు ముస్తాబు

**ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనులు**

**సర్పంచ్ ఆశ బోయిన అక్షర శ్రీనివాస్..**





**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి :దోమకొండ, అక్టోబర్ 16.(పోరు తెలంగాణ న్యూస్):** సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు దోమకొండ మండలం ముత్యంపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని పెద్దచెరువులో బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చెరువు పరిసరాలను శుభ్రం చేసే పనులు చేపట్టారు.పండుగకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆశ బోయిన అక్షర శ్రీనివాస్, ఉపసర్పంచ్ మహేందర్ గౌడ్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మండల పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

**ఎంపీడీవో ముత్యాలరావు ఆధ్వర్యంలో ఏడవ రోజు వేడుకలు..**





**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం: అక్టోబర్ 16 :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో ముత్యాలరావు ఆధ్వర్యంలో ఏడవ రోజు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బతుకమ్మల ను రంగురంగుల పూలతో అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ పాటలు, ఆటలతో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ముడిపడిన సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ పండుగ వైభవాన్ని చాటిచెప్పారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై బి.శాంతిని ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# ఓదెల లో దుర్గామాత వద్ద కుంకుమ పూజ



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి:** ఓదెల మండల కేంద్రంలోని జగదాంబ సెంటర్‌లో కొలువుదీరిన దుర్గామాతకు మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూలు, పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు చేశారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలతో జగదాంబ సెంటర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహిళల భక్తి, ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణతో కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానికంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## మండల వ్యాప్తంగా స్థానిక సమస్యలపై పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు ఇవ్వాలి -- కోడి అమరేందర్ యాదవ్



**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం అక్టోబర్ 16 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు....అశ్వాపురం మండలం లో ఉన్నటువంటి ప్రతి గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యలను గుర్తించి,ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు దరఖాస్తులు అందజేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిస్తున్నాను.ప్రస్తుతం బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో వీధి దీపాలు, విద్యుత్ లైటింగ్, పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, చెత్త తొలగింపు, తాగునీటి సరఫరా తదితర సమస్యలను గుర్తించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతూ దరఖాస్తులు సమర్పించాలి.అదేవిధంగా, ప్రతి గ్రామంలో ఉన్న బతుకమ్మ గద్దెల వద్ద స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారే స్వచ్ఛందంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,రాష్ట్ర నాయకులు తన్నీరు హరీష్ ,మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఫోటోలతో చక్కని ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నాను.ఈ ఫ్లెక్సీల ఏర్పాటు పూర్తిగా స్వచ్ఛందంగా ఉండాలి. ఎవరిపైనా ఎలాంటి ఒత్తిడి లేకుండా ఎవరికి వారే ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నాను. ఈ విషయంలో ఎటువంటి వివాదాలకు, కాంట్రవర్సీలకు తావివ్వకుండా సంయమనంతో వ్యవహరించాలి.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, బతుకమ్మ పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో గ్రామస్థాయిలో ఉన్న ప్రతి ఒక్క బిఆర్ఎస్ కార్యకర్త చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాను. కోడి అమరేందర్ యాదవ్ అశ్వాపురం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు.

## భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం అక్టోబర్ 16:** శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మొండికుంట రాజీవ్ స్ట్రీట్ లోని భవాని యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు భక్తులు మహిళలు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అమ్మవారు ఈ రోజు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారని పేర్కొన్నారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ యొక్క అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు

## అభివృద్ధి పనులను సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలి

అంగన్‌వాడీ,పంచాయతీ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశం....

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్....



**పోరు తెలంగాణ అక్టోబర్ 16:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సమన్వయంతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి సమీక్ష నిర్వహించారు.గ్రామపంచాయతీ, వీఓ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. మూత్రశాలలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి వెంటనే మంజూరు చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పెండింగ్ పనులను గుర్తించి, పూర్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.అటవీ భూముల సమస్యలున్న చోట అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలన్నారు. అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి, సర్పంచ్‌తో పాటు గ్రామస్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, నిబంధనల ప్రకారం స్థలాలను ఎంపిక చేయాలని తెలిపారు. ఇందుకోసం అటవీ శాఖ సహా ఇతర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

## లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ వైద్య సేవలను వినియోగించుకోండి

కాగజ్‌నగర్‌లో నవంబర్ 5 వరకు ఉచిత వైద్య శిబిరం....

జిల్లా కలెక్టర్ కె. హరిత....



**పోరు తెలంగాణ అక్టోబర్ 16:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కాగజ్‌నగర్ మండలం ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా అందించే వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. శుక్రవారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ప్రారంభించారు.ఈ నెల 16 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. మారుమూల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎక్కువ మందికి చేరేలా విస్తృత ప్రచారం చేపడుతున్నామని చెప్పారు. కంటి, చెవి, ఆర్థోపెడిక్, పెదవి చీలిక, కాలిన గాయాలు, దంత చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ సేవలు ఇక్కడ అందుతాయని వివరించారు.ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ, కాగజ్‌నగర్‌లో లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ సేవలు అందించడం ఇది రెండోసారని, 2022లో కూడా ఇక్కడ సేవలు అందించారని గుర్తుచేశారు. 1991లో ప్రారంభమైన ఈ రైలు ఇప్పటివరకు పలు రాష్ట్రాల్లో 256 ప్రాజెక్టులను పూర్తి చేసిందని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సేవలు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, తహసీల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఫౌండేషన్ నిర్వాహకులు డా. రోహిణి, డా. మనోహర్ రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ మున్సిపాలిటీ బార్ లాటరీ ద్వారా కేటాయింపు

207 దరఖాస్తుల్లో రమేష్ గౌడ్‌కు అదృష్టం....



**పోరు తెలంగాణ అక్టోబర్ 16:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి మంజూరైన నూతన బార్ అండ్ రెస్టారెంట్‌ను లక్కీ లాటరీ పద్ధతిలో కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డితో కలిసి ఆమె ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా, మొత్తం 207 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ చెప్పారు. దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించిన లాటరీలో 102వ నంబరు దరఖాస్తుదారు మల్లు రమేష్ గౌడ్ ఎంపికయ్యారని తెలిపారు. బార్ నిర్వహణలో ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించాలని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అబ్కారీ, మద్యనిషేధ శాఖ అధికారి లక్ష్మీ నాయక్, సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి

పండుగల వేళ అప్రమత్తంగా ఉండాలని

పోలీసులకు ఆదేశం....

జిల్లా ఎస్పీ నీతిక పంత్....





**పోరు తెలంగాణ అక్టోబర్ 16: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కేసుల దర్యాప్తులో నాణ్యత పాటించి, నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని, బాధితులకు న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసుల విచారణలో జాప్యం చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, దుర్గామాత ఉత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జరిగేలా చూడాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 112 కాల్స్‌కు వెంటనే స్పందించాలని సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకుని, వాటి పురోగతికి కృషి చేయాలన్నారు. కేసుల నమోదు, దర్యాప్తు, నేరస్తుల వివరాల నిర్వహణలో సీసీటీఎన్ఎస్‌ను సమర్థవంతంగా వినియోగించాలని చెప్పారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం, బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, తీవ్రమైన నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రజలు తమ నివాసాలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాపర్టీ కేసుల్లో సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని, సొత్తును రికవరీ చేసి బాధితులకు త్వరగా అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై, ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిపై నిరంతరం తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం చేసుకోవాలని, ప్రతి స్టేషన్ పరిధిలో నాకాబందీ, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

## వృద్ధుడి అదృశ్యం.. ఆచూకీ కోసం విజ్ఞప్తి



**భద్రాచలం అక్టోబర్ 16 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు:** భద్రాచలం పట్టణంలో 86 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమయ్యారు. పట్టణంలోని ఆర్యవైశ్య సత్రం ఎదురుగా నివాసముంటున్న యాసరపు లక్ష్మణ్ (86) ఈ నెల 13వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆయన ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో లక్ష్మణ్ కుమారుడు శ్రీనివాసరావు భద్రాచలం టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన సమయంలో లక్ష్మణ్ తెల్లటి ప్యాంటు, నల్లటి టీషర్టు ధరించి ఉన్నారు. ఆయనకు తెలుపు, నలుపు రంగులు కలిసిన ఉంగరాల జుట్టు ఉంటుంది. లక్ష్మణ్ మానసిక స్థితి సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపిన నేపథ్యంలో ఆయన ఆచూకీ గుర్తించేందుకు ప్రజల సహకారం అవసరం. వృద్ధుడి ఫోటోను పరిశీలించి ఎక్కడైనా కనిపించినా, ఆయన ఎక్కడ ఉన్నారనే సమాచారం తెలిసినా వెంటనే భద్రాచలం టౌన్ పోలీసులకు సమాచారం తెలపాలనిముఖ్యంగా పరిసర గ్రామాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఆయనను గుర్తించినవారు సమాచారం అందించాలి. ఆచూకీ తెలిసినవారు 8712682160, 8712682105 ఫోన్ నంబర్లకు సంప్రదించాలి. వృద్ధుడిని సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు ప్రజలు సహకరించాలని, ఈ సమాచారాన్ని ఇతర ప్రాంతాలకు కూడా చేరవేయాలని భద్రాచలం సిఐ ఎస్ రాజు ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు

## అనారోగ్యంతో మృతి చెందిన టాటా మ్యాజిక్ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, అక్టోబర్ 16: భీమారం గ్రామానికి చెందిన టాటా మ్యాజిక్ డ్రైవర్ వేల్పుల మల్లేష్ గత నెల రోజుల క్రితం అనారోగ్య కారణాలతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి టాటా మ్యాజిక్ ఓనర్స్ అసోసియేషన్ తరపున రూ.20,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఆర్థిక సహాయాన్ని భీమారం ఎస్సై ఎ. రాజేందర్ చేతుల మీదుగా మల్లేష్ కుటుంబ సభ్యులకు అందించారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టాటా మ్యాజిక్ అసోసియేషన్ చెన్నూర్ అధ్యక్షుడు ఎన్. సమ్మయ్య, ఉపాధ్యక్షుడు జాడి శ్రీనివాస్, బి. వెంకటేష్, జి. తిరుపతి, దుర్గయ్య, రవి తదితర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## చెన్నూరులో మెగా రక్తదాన శిబిరం.. 60 మంది రక్తదానం



**పోరు తెలంగాణ, మంచిర్యాల జిల్లా, అక్టోబర్ 16:** చెన్నూరు పట్టణంలోని లయోలా స్కూల్‌లో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 60 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి చెన్నూరు మున్సిపల్ చైర్మన్ పెద్దింటి పద్మ, కౌన్సిలర్ కొమ్మెర విజయలక్ష్మి, లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ జాడి తిరుపతి, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్, లయోలా స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల సాగర్, లయన్ నిమ్మల విశాల, ప్రోగ్రాం చైర్ పర్సన్ లయన్ బొల్లంపల్లి నాగరాజాగౌడ్, ప్రోగ్రాం కో చైర్పర్సన్ లయన్ పప్పిరెడ్డి దీక్షిత్, కార్యదర్శి లయన్ సొడం శ్రీనివాస్, కోశాధికారి లయన్ కప్స్ ప్రతాప్ సింగ్,లయన్ కట్ట సదానందం, లయన్ జక్కుల సత్యనారాయణ, ముత్యాల శ్రావణి గౌడ్, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సేల్స్ మేనేజర్ తడకల సంపత్,హాజరయ్యారు. అలాగే లయన్స్ క్లబ్ సభ్యులు, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, రక్తదాతలు పాల్గొన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారికి రక్తం అందించి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ సందర్భంగా నిర్వాహకులు పిలుపునిచ్చారు. 60 మంది రక్తదానం చేయడం ద్వారా ఈ శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది.

## పద్మశాలి సంఘం కామారెడ్డి నియోజకవర్గ నూతన కమిటీ ఏర్పాటు - కమిటీ చైర్మన్ గా ఐరేని నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నిక



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి:అక్టోబర్ 16(పోరు తెలంగాణ న్యూస్:):** కామారెడ్డి నియోజకవర్గ పద్మశాలి సంఘం నూతనంగా ఏర్పాటు చేసినట్లు దోమకొండ సర్పంచ్ ఐరేని నరసయ్య శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్వీనర్ గా ఐరేని నరసయ్య, కో కన్వీనర్ గా చాట్ల రాజేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నిక అవడం జరిగిందన్నారు. అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని వివరించారు. నూతనంగా ఎన్నికైన కన్వీనర్ ఐరేని నరసయ్య మాట్లాడుతూ చేనేత సహకార సంఘ సభ్యులకు కార్డులు, పెన్షన్లను ప్రభుత్వం ద్వారా మంజూరు చేసేందుకు కమిటీ ద్వారా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పద్మశాలీలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, రాజకీయంగా ఎదగాలని, సహకార సంఘాలు బలోపేతం అయ్యేవిధంగా తోడ్పాటును అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల సభ్యులు పాల్గొన్నారు.

## పేదల కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం.ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు చేసి నూతన వస్త్రాలు అందజేసిన కాంగ్రెస్ పాల్వంచ మండల అధ్యక్షులు పల్లె రమేష్ గౌడ్..



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి :అక్టోబర్ 16(పోరు తెలంగాణ న్యూస్:):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ సహకారంతో కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామానికి చెందిన సౌజన్య – రామ్ రెడ్డి దంపతుల నూతన ఇందిరమ్మ ఇల్లు మరియు బట్టెంకి కీర్తి– బాల్ రాజు నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ శుభకార్యాలకు పాల్వంచ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుపల్లె రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహప్రవేశం చేసిన కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చొప్పదండి ఆర్యవైశ్య సంఘ ప్రాంగణంలో ఘనంగా కుంకుమ పూజలు



**అక్టోబర్ 16, 2026 పోరు తెలంగాణ న్యూస్, చొప్పదండి ప్రతినిధి:** ఈరోజు చొప్పదండి వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో మండల ఆర్యవైశ్య సంఘాలసమైక్యఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 15వ. శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈరోజు అమ్మవారు సరస్వతి మాత అవతారంలో దర్శనమిచ్చారు ఇందులో భాగంగా నిర్వహించినటువంటి కుంకుమ పూజలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ వేడుకలలో అందరూ తమ తమ కుటుంబాలతో కలిసి ఉత్సాహంతో అమ్మవారిని ప్రార్థించి అందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుని ఈ కార్యక్రమాన్ని సంతోషంగా ముగించారు

## సాయిరాం యూత్ దుర్గ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా దుర్గా శరన్నవరాత్రోత్సవాలు

ఆరవ రోజు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు.

ఘనంగా అక్షరాభ్యాసం, కుంకుమ పూజ కార్యక్రమాలు





**పోరు తెలంగాణ, మంచిర్యాల జిల్లా అక్టోబర్ 16:** భీమారం మండలంలోని రావి చెట్టు వాడలో సాయిరాం యూత్ దుర్గ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గా శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారుల భవిష్యత్తుకు విద్యాబుద్ధులు కలగాలని ఆకాంక్షిస్తూ అక్షరాభ్యాస కార్యక్రమాన్ని, మహిళల భాగస్వామ్యంతో కుంకుమ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాలు దిద్దించి, విద్యాభ్యాసానికి శుభారంభం చేశారు. అనంతరం నిర్వాహకులు చిన్నారులకు పలకలు, నోట్‌బుక్కులు అందజేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, భీమారం మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సాయిరాం యూత్ దుర్గ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని సమితి సభ్యులు కోరారు.

## ముఖ్య సూచన రైతులకు ముందస్తు జాగ్రత్తలపై విస్తృత ప్రచారం

రైతన్నా... ముందుచూపే మన బలం!




**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:అక్టోబర్ 16.(పోరు తెలంగాణ న్యూస్:):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ, నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునేలా రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం ద్వారా విడుదల చేయడం జరిగింది. ఈ పోస్టర్‌ను గ్రామస్థాయి, మండలస్థాయిలోని అన్ని అధికారిక వాట్సాప్ గ్రూపులతో పాటు సంబంధిత సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. జిల్లాలోని ప్రతి గ్రామానికి, ప్రతి రైతుకు ఈ సమాచారం చేరేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలి. రైతుల్లో అవగాహన పెంపొందించి, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలపై సమాచారాన్ని ప్రతి రైతుకు చేరవేయాలిఅని సూచించారు.

# ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన కీలకం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి//మంచిర్యాల అక్టోబర్ 16, 2026:** ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన కీలకమని, 2వ దశ జనాభా గనన కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సాంకేతిక సహాయకులు, ఛార్జ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, డివైఎస్ఓ రాజేందర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యకలాపాలను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించడం, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించడం, ప్రజలకు అందించే సంక్షేమ పథకాల రూపకల్పనకు అవసరమైన గణాంకాలను సిద్ధం చేయడమే ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జనగణన మొదటి దశలో భాగంగా గృహాల జాబితా తయారీ, గృహాల వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్యకు సంబంధించిన వివరాలను సేకరించడం జరిగిందని, 2వ దశలో ప్రతి కుటుంబానికి సంబంధించి మొత్తం 40 ప్రశ్నల ద్వారా అవసరమైన సమాచారాన్ని సేకరించవలసి ఉంటుందని తెలిపారు. త్రాగునీటి సరఫరా, కిరోసిన్ వినియోగం, పక్కా ఇళ్ల వివరాలు తదితర అంశాలపై ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని, సేకరించిన సమాచారం ఆధారంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు రూపొందించడంతో పాటు గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలు, ప్రజా సేవల అభివృద్ధికి సంబంధించిన విధానాలను రూపొందించవచ్చని తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్‌కు ప్రశ్నలపై పూర్తి అవగాహన ఉండాలని, ప్రజలకు సందేహాలు ఉంటే నివృత్తి చేస్తూ సరైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. తొలిసారిగా జనగణన ప్రక్రియను డిజిటల్ విధానంలో నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు మొబైల్ యాప్ ద్వారా సమాచారాన్ని నమోదు చేయడం జరుగుతుందని, జనాభా గణనకు సంబంధించి 2027 మార్చి 1వ తేదీని సూచన తేదీగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. జనగణనలో భాగంగా 15 రోజుల పాటు స్వీయ గణనకు అవకాశం కల్పించడం జరుగుతుందని, స్వీయ గణన ద్వారా వివరాలు నమోదు చేసిన వారికి ప్రత్యేకంగా కేటాయించిన ఎస్.ఈ. ఐ డి. ఆధారంగా ముందుగా నమోదు చేసిన సమాచారాన్ని పరిశీలించవచ్చని, అనంతరం ఎన్యుమరేటర్ సంబంధిత కుటుంబాన్ని సందర్శించి, నమోదు చేసిన వివరాలను ధ్రువీకరించి, అవసరమైన సవరణలు చేస్తారని తెలిపారు. ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరించే ఎన్యుమరేటర్‌తో పాటు సూపర్‌వైజర్, ఛార్జ్ అధికారి స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందని శిక్షణలో వివరించారు. సూపర్‌వైజర్లు యాదృచ్ఛికంగా 20 శాతం వివరాలను తనిఖీ చేస్తారని, ఛార్జ్ అధికారులు తమ లాగిన్‌ల ద్వారా సంబంధిత సమాచారాన్ని పరిశీలించి తప్పులను గుర్తించాలని సూచించారు. ఎన్యుమరేటర్లు జనగణనలోని ప్రతి ప్రశ్నను పూర్తిగా అర్థం చేసుకొని, ప్రజలకు స్పష్టంగా వివరించాలని, 15 రోజుల స్వీయ గణన వ్యవధిలో ఎక్కువ మంది ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. శిక్షణలో ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని, క్షేత్రస్థాయి విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన విషయాలను పూర్తిగా నేర్చుకోవాలని తెలిపారు. జనగణనలో ఇండ్లు లేని వ్యక్తులతో సహా అర్హులైన ప్రతి వ్యక్తి వివరాలు నమోదు అయ్యేలా చూడాలని, పునఃపరిశీలన సమయంలో మరణాలు తదితర మార్పులను నిబంధనల ప్రకారం నవీకరించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ రాష్ట్ర కన్సల్టెంట్ కె. కృష్ణయ్య, మాస్టర్ ట్రైనర్ శరణ్య లు సాంకేతిక సహాయకులు, ఛార్జ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల పెండింగ్ పీఎఫ్, జీతాలు వెంటనే చెల్లించాలి

**కార్మికులకు అండగా టీఆర్ఎస్ పార్టీ నాయకులు....**

**పండుగ పూట పస్తులు ఉండే పరిస్థితి రావడం బాధాకరం....**



**పోరు తెలంగాణ అక్టోబర్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కాగజ్‌నగర్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ డబ్బులు రూ.1 కోటి 40 లక్షలతో పాటు, ఒక నెల జీతాన్ని వెంటనే చెల్లించాలని టీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు తమ పార్టీ తరఫున మద్దతు ప్రకటిస్తూ, వారి సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దేవల వీరన్న, సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ కావేటి సబిత మనోహర్ మాట్లాడుతూ పట్టణంలోని వీధులను శుభ్రం చేస్తూ, చెత్తాచెదారాన్ని తొలగిస్తూ, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు మున్సిపల్ కార్మికులు ప్రతిరోజూ శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం, వారి పీఎఫ్ డబ్బులు పెండింగ్‌లో ఉండటం ఆందోళనకరమని అన్నారు. కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోవడానికి నెలవారీ జీతంపైనే ఆధారపడతారని, జీతాలు అందకపోతే ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, నిత్యావసరాల కొనుగోలు వంటి అవసరాలను తీర్చుకోవడం కష్టంగా మారుతుందని తెలిపారు. ముఖ్యంగా పండుగల సమయంలో కూడా కార్మికులు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికుల సంక్షేమాన్ని అధికారులు విస్మరించకూడదని అన్నారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్ నిధులు రూ.1.40 కోట్లను, పెండింగ్‌లో ఉన్న ఒక నెల జీతాన్ని తక్షణమే చెల్లించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారికి అండగా నిలుస్తామని నాయకులు తెలిపారు. కార్మికుల శ్రమను గుర్తించి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రభుత్వ వైపు చింతకుంట విజయ రమణారావు**

**అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న జీలకుంట గ్రామం**

**ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన**

**గ్రామ సర్పంచ్ రాగిడి మంగ శ్రీనివాసరెడ్డి**





**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి:** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం జీలకుంట గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు చెరువు కట్టపై వైకుంఠధామం కు వెళ్లే విద్యుత్తు వెలుగుల ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభోత్సవం చేశారు గ్రామ అభివృద్ధి కోసం గ్రామ ప్రజల కోసం ఎమ్మెల్యే విద్యుత్ సౌకర్యం కోసం 4 లక్షలు మంజూరు చేయగా 22 స్తంభాలతో చెరువు కట్ట నుండి వైకుంఠధామానికి విద్యుత్తు వెలుగులు అందించారు సర్పంచ్ రాగిడి మంగ శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వైకుంఠధామం నిర్మించి విద్యుత్ సౌకర్యం లేక అంత్యక్రియలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు గ్రామ ప్రజలు .. చెరువుకట్టపై విద్యుత్తు లేకపోవడంతో రాత్రివేళ రైతులు పొలాలకు వెళ్లే సమయంలో అనేక ఇబ్బందులకు గురైనారు సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధతో విద్యుత్ సౌకర్యం కోసం విద్యుత్ శాఖ వారిని సంప్రదించి బతుకమ్మ పండుగ లోపు విద్యుత్ అధికారులతో వేగంగా పనులు పూర్తి చేశారు అడిగిన వెంటనే ఎమ్మెల్యే ప్రజల సౌకర్యార్థం నిధులు మంజూరు చేయించి శుక్రవారం పూర్తయిన అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున సర్పంచి రాగిడి మంగా శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సకాలంలో విద్యుత్ అధికారులు ఏడి రవీందర్, డి ఈ వీరబ్రహ్మం, ఏ ఈ మోహన్ వేగంగా పనులు పూర్తి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు . కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ రెడ్డి,గూడెం సర్పంచ్ చిట్ల రాము,ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, పుప్పాల శంకర్ ,తీర్థాల వీరన్న, బొంగుని శ్రీనివాస్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## వాడి గ్రామ ప్రజలందరికీ బతుకమ్మ, దసరా మరియు దీపావళి పండుగల హార్దిక శుభాకాంక్షలు




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 (పోరు తెలంగాణ న్యూస్:):** మన తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మ సంబరాలు, విజయాలను అందించే విజయదశమి, మరియు చీకట్లను పారద్రోలే దీపావళి పండుగలను మీ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని వాడి కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం వాడి గ్రామ సర్పంచ్ నర్సారెడ్డి( ధోని) తెలిపారు.

**తొమ్మిది రోజుల పాటు సందడి:**

ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగిసే తొమ్మిది రోజుల పండుగ రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య జరుగుతుందని గ్రామ సర్పంచ్ నర్సారెడ్డి తెలిపారు. ఆడపడుచులు కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో కలిసి ఒకచోట చేరి ఆటపాటలతో పండుగను ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ప్రకృతిని పూజిస్తూ, తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రజల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ పండుగలు మీ అందరి జీవితాల్లో సుఖసంతోషాలను, ఆయురారోగ్యాలను, మరియు అష్టైశ్వర్యాలను నింపాలని ఆకాంక్షిస్తూ... గ్రామ పంచాయతీ సర్పంచ్ నర్సారెడ్డి( ధోని) మరియు పాలకవర్గం.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కు పాదం

**అక్రమ ఇసుక రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవు....**

**బెజ్జూర్ ఎస్సై రమేష్....**






**పోరు తెలంగాణ అక్టోబర్ 16: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను సలుగుపల్లి గ్రామంలో పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న ఇసుక విలువ సుమారు రూ.2,000 ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనపై బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బెజ్జూర్ ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం, రవాణా చేయడం లేదా విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతూ పట్టుబడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక వ్యాపారం నిర్వహించేవారు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే ఇసుక తవ్వకాలు, రవాణా, విక్రయాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిరంతరం నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సరస్వతి దేవి అలంకరణలో శ్రీ రాజరాజేశ్వర స్వామి అమ్మవారు



**మహేశ్వరం, అక్టోబర్ 16, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మహేశ్వరంలో ప్రసిద్ధిగాంచిన శివగంగ పుణ్యక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఈవో మురళీకృష్ణ, ప్రధాన పూజారులు వీరేశం, రాజు ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం జరిగిన హోమంలో కాడ మౌని జంగయ్య మంజుల దంపతులు, జోరల శీను మంగ పాల్గొన్నారు. అనంతరం జోరల శ్రీను దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలుగా లక్కం రాజ్యలక్ష్మి.




**పోరు తెలంగాణ, అక్టోబర్ 16:** హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు లక్కం రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని సంస్థ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, జాతీయ చైర్మన్ మహమ్మద్ తక్దీర్ అలీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఇందులో భాగంగా లక్కం రాజ్యలక్ష్మి ని తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా ప్రకటించారు. ఈ సందర్భంగా లక్కంరాజు లక్ష్మి మాట్లాడుతూ.. నేటి సమాజంలో చాలామంది సామాన్య ప్రజలు తమ హక్కులపై పూర్తి అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తమకు ఎదురవుతున్న సమస్యను గుర్తించలేని పరిస్థితితో పాటు, సమస్యను ఎవరికి తెలియజేయాలి, పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించాలి అనే విషయాలపై అవగాహన లేని ప్రజలు ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ, వారికి న్యాయపరమైన అవగాహన కల్పించడం, సమస్యల పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడమే హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా ప్రధాన లక్ష్యమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంస్థను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని లక్కం రాజలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నేషనల్ జనరల్ సెక్రటరీ సన, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రమ్యశ్రీ, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పెద్దపల్లి అధ్యక్షులు కొమ్ము ఓదెలు జిల్లా జనరల్ సెక్రటరీ గడ్డం సత్యనారాయణ, మీడియా సెక్రటరీ బోయిని ప్రసాద్,జాయింట్ సెక్రటరీ గీట్ల మధు గారు తదితరులు పాల్గొన్నారు.

# తాళ్ళగొమ్మురు గ్రామ పంచాయతి

**బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న.... మాజీ జెడ్పీటీసీ**

**భద్రాద్రి కొత్తగూడెం,**



**(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) భూర్గంపహాడ్ అక్టోబర్ 16:** బూర్గంపాడు మండలం తాళ్ళగొమ్మురు గ్రామ పంచాయతీలో మహిళల ఆహ్వానం మేరకు బతుకమ్మ సంబరాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు,అనంతరం మహిళలతో కలిసి భక్తి పాటలతో ఆడి పాడిన బూర్గంపాడు మండలం మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ,వారితో పాటు వార్డు మెంబర్లు,మరియు పార్టీ నాయకులు,మహిళలు, పిల్లలు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# పంటల కొనుగోలు ప్రక్రియకు లారీల యజమానులు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి// మంచిర్యాల అక్టోబర్ 16, 2026:** జిల్లాలో పత్తి, వరి తదితర పంటల కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు లారీల యజమానులు, జిల్లా లారీ అసోసియేషన్ ప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పంటల కొనుగోలు కేంద్రాల నుంచి పంటలను తరలించే రవాణా ప్రక్రియలో, కొనుగోలు కేంద్రాల వద్ద లారీలను అందుబాటులో ఉంచడం, అవసరమైన సమయంలో రవాణా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలలో లారీల యజమానులు సహకరించాలని, పంటల కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పంటల కొనుగోలు, రవాణా ప్రక్రియలు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియకు ఆటంకాలు కలిగించినట్లయితే సంబంధిత వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. పంటల కొనుగోలుకు అవసరమైన రవాణా సదుపాయాలను సమకూర్చే క్రమంలో, అవసరాన్ని బట్టి ఇతర ప్రాంతాల నుంచి లారీలను జిల్లాలోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా లారీ అసోసియేషన్ ప్రతినిధులు, లారీల యజమానులు జిల్లా యంత్రాంగానికి సహకరిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.

# జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు





**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి// మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆఫీసర్స్, సిబ్బంది, మహిళలు కలిసి బతుకమ్మ సంబరాలతో ఆటపాటలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కలెక్టర్, సబ్ కలెక్టర్, అధికారులు, సిబ్బంది, ఈ వేడుకలలో పాల్గొన్నారు.

# జలసిరి పనులు ముమ్మరం

**కైరి గ్రామపంచాయతీలో నిటి సం క్షణ పనులు శ్రీకారం....**



**పోరు తెలంగాణ అక్టోబర్ 16 : కెరమేరి:** కెరమేరి మండలంలోని ఖైరి గ్రామపంచాయతీ లో జలసిరి పనులు ముమ్మరం గా కొనసాగుతున్నాయి ప్రభుత్వ ఆదేశాలు జిల్లా పాలన అధికారి కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామపంచాయతీలో వి .బుజ్జి రామంజి కింద నిరంతరంగా పూడిక పనులు చేపట్టాలని నిర్ణయించారు ఇందులో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో 50 మంది కూలీలు పని చేసేలా చర్యలు తీసుకుంటున్నారు నీటి నిల్వ నీటి సంరక్షణ లో భాగంగా అతి తక్కువ నమోదవుతున్న వర్షపు నీటి ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ఈ మట్టి పూడిక పనులను ఎంతగానో దోహదపడతాయని అధికారులు తెలిపారు ఖైరీ గ్రామపంచాయతీలలో జరుగుతున్న పనులను సాంకేతిక సహాయకులు టి ఏ అరవింద్ మెట్ ప్రపోల్ పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు నేటి సంరక్షణ లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు

# పోతర్ల సుదర్శన్ యాదవ్ కు సన్మానం చేసిన యాదవ సంఘం నేతలు..



**మహేశ్వరం, అక్టోబర్ 16, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మహేశ్వరం అఖిలభారత యాదవ సంఘం నేతలు శుక్రవారం మాజీ ఎంపీటీసీ, బిజెపి ఓబిసి మోర్చా అధ్యక్షుడు పోతర్ల సుదర్శన్ యాదవ్ ను మహేశ్వరం అఖిల భారత యాదవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం యాదవ సంఘం అధ్యక్షుడు టి. లక్ష్మయ్య యాదవ్, పెద్ద గొల్ల మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ యాదవ సంఘం నాయకులు శ్రీశైలం యాదవ్, చెన్నయ్య యాదవ్, రాజు యాదవ్, పాండు యాదవ్ పెద్దలు టి.శ్రీశైలం యాదవ్, కృష్ణ యాదవ్, వి.శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులు సూదిరెడ్డి గోపిరెడ్డిని పరామర్శించిన.. ఎస్ కే టి గ్రూప్ డైరెక్టర్ దోసపాటి

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన పిచ్చేశ్వరరావు**



**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి)అశ్వాపురం అక్టోబర్ 16 :** అశ్వాపురం మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సూదిరెడ్డి గోపిరెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏషియన్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య చికిత్స వివరాలను తెలుసుకుంటూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న గోపిరెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి సాధారణ జీవితాన్ని కొనసాగించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా దోసపాటి పిచ్చేశ్వరరావు గోపిరెడ్డికి ధైర్యం చెబుతూ, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్య సమయంలో ఆత్మవిశ్వాసంతో ఉండాలని, త్వరలోనే కోలుకుని ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.

# సీనియర్ పాత్రికేయులు జంగం విజయ్ కన్నుమూత

**టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రగాఢ సంతాపం**



**పోరు తెలంగాణ ప్రతినిధి //మెట్‌పల్లి:** మెట్‌పల్లి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు జంగం విజయ్ అనారోగ్యంతో కన్నుమూశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో మెట్‌పల్లి పాత్రికేయ రంగంలో విషాదం అలుముకుంది. సుదీర్ఘకాలంగా పాత్రికేయ రంగంలో సేవలందించిన జంగం విజయ్ మృతి పట్ల జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహచర పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బూరం సంజీవ్, కార్యదర్శి మహమ్మద్ అజీమ్ మాట్లాడుతూ.. జంగం విజయ్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. జంగం విజయ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబానికి తమ సంఘం అండగా ఉంటుందని, వారి దుఃఖంలో భాగస్వాములమవుతున్నామని తెలిపారు. ఆయన మృతి పట్ల టీయూడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# బతుకమ్మ సంబరాల్లో మునిగిన మండల కార్యాలయం

**మహిళా అధికారులు, కార్యదర్శులతో ఘనంగా బతుకమ్మ పూజ**



పోరు తెలంగాణ నెక్కొండ అక్టోబర్ 16 ఈరోజు నెక్కొండ మండల కార్యాలయంలో బతుకమ్మ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళా సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మను పూజించి, చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వై. లావణ్య ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరై, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఆమె మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, మహిళల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో జి. దయాకర్ సూపరిండెంట్ జక్కుల ఐలయ్య సీనియర్ అసిస్టెంట్ జి. అనురాధ జూనియర్ అసిస్టెంట్ ఏ. సుందర్ జూనియర్ అసిస్టెంట్ , టైపిస్టు శ్రీనివాస్ రెడ్డి గారు, ఏపీవో జాకబ్ గారు, రజిత ఈసీ , రజిత టీఏ కవిత టీఏ మరియు పంచాయతీ కార్యదర్శులులి పాల్గొన్నారు. రంగురంగుల చీరలతో, పూల బతుకమ్మ చుట్టూ మహిళలు ఆడిన ఈ వేడుకను చూసేందుకు కార్యాలయంలోని వారు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చివరలో అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమం ముగించారు

# నీటిని పొదుపుగా వాడుకోవాలి

**గ్రామ సర్పంచ్ బండారి లింగం ముదిరాజ్..**



మహేశ్వరం, అక్టోబర్ 16, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి: నీటిని పొదుపుగా వాడుకోవాలని నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం నాగారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభను డిప్యూటీ తాసిల్దార్ సంతోష్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలాలను సంరక్షించుట కొరకు గ్రామంలో ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. ఎల్ నీ వో ప్రభావం వల్ల గ్రామాలలో నీటి కొరత ఏర్పడుతుందని అన్నారు. ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టాలని ఆయన సూచించారు. నాగారం రోడ్డు అధ్వానంగా తయారైందని అధికారులు పట్టించుకోని రహదారి నిర్మాణ పనులను చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంచె చంద్రకళ, కార్యదర్శి మాణిక్యం వార్డు సభ్యులు శ్యామలమ్మ, నయీమ్ ఖాన్, షాబ్ కాన్, మహేందర్, రాజు, సురేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముసలిమడుగులో రూ.2.50 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేసిన పినపాక ఎమ్మెల్యే,



**బూర్గంపాడు అక్టోబర్ 16 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు:** బూర్గంపాడు మండలం ముసలిమడుగు గ్రామపంచాయతీలో రూ.2 కోట్ల 50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం (సబ్‌స్టేషన్) నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం లక్ష్యంగా చేపడుతున్న ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం స్థానిక ప్రాంత అభివృద్ధిలో కీలక ముందడుగుగా నిలవనుంది. ఈ విద్యుత్ ఉప కేంద్రం అందుబాటులోకి వస్తే ముసలిమడుగు గ్రామపంచాయతీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు, రైతులకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడేందుకు అవకాశం కలుగుతుంది. వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో కీలకమని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూతన సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత పటిష్టం కావడంతో పాటు, స్థానికంగా విద్యుత్ సమస్యలను తగ్గించేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మరియు విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పన, రైతుల అవసరాల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి జిల్లా కార్యదర్శి వారాల వేణు విద్యుత్ శాఖ అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# అశ్వాపురం మండలం లో పర్యటించిన పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు





**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం ప్రతినిధి-వల్లెపోగు రాము) అశ్వాపురం అక్టోబర్ 16 :** అశ్వాపురం మండలం రామచంద్రపురం గ్రామపంచాయతీ పరిధిలో..

1)సత్యనారాయణపురం గ్రామనికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు జక్కుల సందీప్ తండ్రి జక్కుల వెంకన్న ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన..

2) మల్లెల మడుగు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త కోడెం సమ్మయ్య తండ్రి కోడెం నరసింహారావు ఇటీవల అనారోగ్యానికి గురవడంతో వారి ఇంటికెళ్లి పరామర్శించిన..

3) మొండికుంట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పురమ కృష్ణ తల్లి పురమ లింగమ్మ ఇటీవల కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స జరగగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన...

4) సంద్రలబోరు గ్రామపంచాయతీలో ఊకే నాగరాజు తండ్రి ఊకే భద్రయ్య ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన...

4) చింతిర్యాల కాలనీ గ్రామపంచాయతీ పరిధి చింతిర్యాలగూడెం గ్రామంలో ఇటీవల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇర్ప రామయ్య మరణించగా వారి ఇంటికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన.. పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు.

**అన్నప్రాసన వేడుకలో పాల్గొన్న...రేగా**

చింతిర్యాల కాలనీ మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య మనవరాలు " రిత్విక " అన్నప్రాసన వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన...రేగా కాంతారావు ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండలం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, నియోజకవర్గ ఏస్సి సెల్ అధ్యక్షులు ఀ చింతిర్యాల కాలనీ ఉపసర్పంచ్ అశోక్ కుమార్,సీనియర్ నాయకులు జాలే రామకృష్ణారెడ్డి, చింతిర్యాల కాలనీ సర్పంచ్ కొరసా అలివేలు, మిట్టకంట సురేందర్ రెడ్డి, మల్లెల మడుగు ఉప సర్పంచ్ గాడిద మహేష్, మాజీ సర్పంచులు పాయం భద్రయ్య,కుంజా రామారావు, బొక్క శ్రీకాంత్ రెడ్డి,వార్డు మెంబర్లు కోండ్రు సాయమ్మ,కొండ్రు సురేష్, మంగమ్మ, పున్నారావు, కడారి వేణు, రాముడు, నాగార్జున, సకినాల శశి కుమార్, మంద హుస్సేన్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి చదువుకు నిమిత్తం ఆర్థిక సహాయం చేసిన.. పద్దం శ్రీనివాస్



**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి-వల్లెపోగు రాము) మణుగూరు అక్టోబర్ 16 :** పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావుఆదేశాల మేరకు భద్రాద్రి జిల్లా బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు పద్దం శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈరోజు మణుగూరు మండలం ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన గుడ్ల అశ్విత అనే నిరుపేద విద్యార్థినికి చదువుల నిమిత్తం 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించిన... పద్దం శ్రీనివాస్. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా అమ్మకాలు జోరు.. ఎక్సైజ్ శాఖ తీరు బేజారు!

**అశ్వాపురం మండలంలో యథేచ్ఛగా అక్రమ విక్రయాలు?**



**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం అక్టోబర్ 16 :** అశ్వాపురం మండలంలో గుడుంబా అక్రమ విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. గుడుంబా విక్రయాలపై సంబంధిత అధికారులు నిఘా పెట్టి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. గుడుంబా సేవనం ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో, అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే ఎక్సైజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండలంలో గుడుంబా విక్రయాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయి? వాటిని అరికట్టేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి, అక్రమ విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజా పాలనలో పేదలకు న్యాయం

**గంగారం సర్పంచ్ మునావత్ దేవేందర్ నాయక్..**



**మహేశ్వరం, అక్టోబర్ 16, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** ప్రజా పాలనలో పేదలకు న్యాయం జరుగుతుందని గంగారం గ్రామ సర్పంచ్ మునావత్ దేవేందర్ నాయక్ తెలిపారు. శుక్రవారం మునావత్ పూజిత నరేష్ కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి సహకారంతో గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గంగారం గ్రామపంచాయతీలో ఇప్పటివరకు 25 ఇందిరమ్మ ఇండ్లు రావడం జరిగిందని తెలిపారు. ప్రజలు త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు రవి, మోహన్, ధర్మ, దేవ, జ్యోతి, గోపి, శ్రీనివాస్, రాజేష్, నిలియా, భాస్కర్, లక్ష్మి, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

# గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తా

**సర్పంచ్ పోతుల మల్లమ్మ నారాయణ..**



**మహేశ్వరం, అక్టోబర్ 16, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని అమీర్ పేట్ గ్రామ సర్పంచ్ పోతుల మల్లమ్మ నారాయణ అన్నారు. శుక్రవారం 9వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. గ్రామంలో రోడ్లు, మంచినీరు, విద్యుత్తు, పారిశుధ్యం పై దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. పెండింగ్ పనులను దశలవారీగా చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి సహకారంతో గ్రామాన్ని సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దుతా నని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేగూరి చంద్రకళ నరసింహ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి, ప్రజా రాకపోకలకు అంతరాయం కలిగించిన ముగ్గురికి రిమాండ్



**ఇల్లందు అక్టోబర్ 16 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి** కూరపాటి దాసు. కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించడంతో పాటు, రోడ్డుపై అడ్డంగా నిలబడి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించి, పోలీసు సిబ్బంది విధుల నిర్వహణకు ఆటంకం కలిగించిన బండి వెంకటేశ్వర్లు, మద్దెల గోపి, బండి రాజయ్యలపై ఇల్లందు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం వారిని రిమాండ్‌కు పంపారు సమస్యలు లేదా వివాదాలు తలెత్తినప్పుడు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా, చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని ఇల్లందు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యాయత్నం చేస్తామని బెదిరించడం, పెట్రోల్ వంటి ప్రమాదకర పదార్థాలను ఉపయోగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, రహదారులను దిగ్బంధించి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించడం, పోలీసుల విధుల నిర్వహణకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఇలాంటి చర్యల వల్ల ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లడమే కాకుండా, ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరిస్తూ, తమ సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని పోలీసులు కోరారు.

# పద్మాజివాడి గ్రామంలో ఘనంగా అట్లా బతుకమ్మ బతుకుతో ముడిపడిన పండుగ బతుకమ్మ పండుగ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16(పోరు తెలంగాణ న్యూస్:)** కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ పద్మాజివాడి గ్రామంలో ఘనంగా బతుకమ్మ పండుగ గ్రామంలో చిన్న పెద్ద తేడా లేకుండా ఆడపడుచులందరూ పేర్చి పండుగ బతుకమ్మ పండుగ. ఈ సందర్భంగా చిన్నారి చాకలి హారిని మాట్లాడుతూ తంగేడు. గునుగు. చామంతి. వంటి లభించే పూలతో. బతుకమ్మను పేర్చడం ఈ పండుగలోనే ప్రత్యేకత. ప్రకృతిలోని సాజంగా లభించే పూలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా మనుషులు తమ చుట్టూ ఉన్న పర్యావరణంతో ఎంతో సన్నిహితంగా ఉండేవారో . సంప్రదాయం గుర్తుచేస్తుంది. చెరువులు కుంటలు పంట పొలాలు. గ్రామీణ జీవనంతో ముడిపడిన బతుకమ్మ. ఎంగిలిపూల బతుకమ్మగా మొదలై. సద్దుల బతుకమ్మ సంబరాంగ ముగిసే తొమ్మిది రోజుల వైభవం మన సంస్కృతిని చాటి మన బతుకమ్మ పండుగ. చిన్నపెద్ద ఆటపాటలతో ఊరువాడ మారుమోగుతుంది. మహిళాలు ఒక్క దగ్గర చేరి పాటలు పాడడం ఆడడం మహిళలు తమ ఆనందాన్ని కాదు బాధలు ఆశలు ఆకాంక్షలను కూడా పంచుకుంటారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు ఆత్మీయతకు ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పూలను పూజిస్తే ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ ప్రతి ఒక్కరిలో ఆనందాన్ని నింపుతుందని తెలిపారు చిన్నారులు మహిళలందరూ కుటుంబ సభ్యులకు కలిసి బతుకమ్మ పండుగను సంతోషముగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.